

# హైదరాబాద్ వార్త

# వామ్మో..జూన్

-తల్లిదండ్రులను దడపుట్టిస్తున్న జూన్ నెల
-డొనేషన్లు, టర్మ్‌ఫీజుల ,బ్యాగులు, పుస్తకాల భారం
-ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల మోత




**హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:** జూన్ వచ్చిందంటేతల్లిదండ్రుల్లో దడ మొదలువుతుంది. నూతన విద్యాసంవత్సరానికి కొద్దిరోజులే గడవు ఉండటంతో అందుకు అనుగుణంగా పిల్లల తల్లిదండ్రులు చదువుకోసం ఇంటి బడ్జెట్‌ను తయారు చేస్తున్నారు. ఖర్చు భారంగా మారిన పిల్లల భవిష్యత్ కోసం వెచ్చించక తప్పదని భావించి ఖర్చులకు వెనుకాడటం లేదు. సామాన్య, మధ్యతరగతి వారు ప్రైవేట్ ఉద్యోగులు ఇందు కోసం కొన్నినెలల నుంచే తమ ఖర్చులను తగ్గించుకోవడంతోపాటు ఇతర పనుల కోసం డబ్బులను వెచ్చింకుండా వాయిదా వేసుకుంటున్నారు. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, బుక్కులు, లంచ్‌భాక్సులు వంటి ఖర్చులకు అప్పుల కోసం పరిగెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. జూన్12న పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు కొద్దికొద్దిగా చేరుకుంటున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యారునతల కోసం స్టేషనరీ దుకాణాల్లో పుస్తకాల అమ్మకాలు మొదలుపెట్టారు. ఒక్కోనోట్ బుక్కుపై రూ.10నుంచి 15వరకు పెరిగాయి. మరోవైపు స్కూల్ ఫీజుల మాట వింటుంటే తల్లిదండ్రుల భయపడిపోతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్‌కు వెళ్లే పిల్లలు ఉంటే బంగారం వంటి వస్తువులు తాకట్టు పెట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు అడ్మిషన్లు, పుస్తకాలు అయిపోతాయంటూ ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న ప్రచారం అంతా ఇంతా కాదు. దీంతో జూన్ ఖర్చుల నుంచి ఎలా గట్టెక్కాలో తెలియని పరిస్థితి పేద కుటుంబాల్లో కనిపిస్తుంది. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వివిధ రకాల ఫీజుల పేరుతో వసూలు చేస్తూ తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారు.

**యూనిఫాం ..ఇతర ఖర్చులు**

పాఠశాలలు తెరచుకోవడంతోనే ఫీజులు చెల్లించడం ఒకభారమైతే ఇతర ఖర్చులు ఇబ్బందులకు గురి చేస్తాయి. పిల్లలను పాఠశాలలకు పంపించడానికి యూనిఫాం ఇతర సామాగ్రి కొనుగోలు కష్టంగా మారతుంది. పుస్తకాలు,డ్రెస్‌లు, షూ, సాధారణ దుస్తుల ఖర్చు, బస్సు ఫీజు ఇలా అనేక విషయాలుపై తల్లిదండ్రులు లెక్కలు వేసుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో బయట నోట్ పుస్తకాలు ,పాఠ్యపుస్తకాలు కొనుగోలుకు ఒప్పుకోరు. పాఠ్యపుస్తకాలు, బ్యాడ్జీలు పాఠశాల్లోనే కొనుగోలు చేయడంతో కనీసం ఉద్దెర పొందే పరిస్థితి ఉండదు. యాజమాన్యాలు నిర్ణయించిన రేటుకు తీసుకోవడానికి కూడా పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రతిఇంటికి అదనంగా 20 నుంచి 60వేల ఖర్చు ..**

జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుండటేనే ప్రతి ఇంటిలో ఎల్‌కేజీ నుంచి పదోతరగతి ,ఇంటర్మీడియట్ వరకు టర్మ్‌ఫీజులు, బస్‌రవాణాతోపాటు ఇతర ఖర్చులు కలిపితే 20వేల నుంచి 60వేల వరకు ఖర్చవుతుంది. కార్పొరేట్ పాఠశాలలు కుప్పలు తెప్పలుగా ఉంటంతో పిల్ల చదువులకోసం మద్యతరగతి కుటుంబాలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. ఇంజనీరింగ్ చదవాలంటే కళాశాలల్లో ఫీజుల రియంబర్స్‌మెంట్ మినహాయించి కళాశాలల్లో ఫీజులు లక్షల్లోనే ఉన్నాయి. మరోవైపు హాస్టల్ ఫీజుల అదనపు భారం ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ ఫీజులు వేలల్లో ఉన్నాయి. దీనికి తోడు ఈవెంట్స్ పేరుతో అదనపు వసూళ్లు కూడా చేస్తుంటారు. పుస్తకాలతోపాటు బ్యాగులు ,టిఫిన్‌బాక్కుల రేట్లు మండిపోతున్నాయి.

## భూభారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకం

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ట్రైనీ సర్వేయర్లకు కిట్ అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం లైసెన్స్ సర్వేయర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని 50 రోజులపాటు ఇచ్చే లైసెన్సుడ్ సర్వే ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమమును జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి లో నిరుద్యోగ లైసెన్సుడ్ సర్వే శిక్షణ పొందేందుకు ఐటిఐ, సివిల్ ఇంజనీరింగ్ చేసిన నిరుద్యోగులైన హైదరాబాద్ జిల్లాకు చెందిన 76 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని వీరందరికీ అనుభవజ్ఞులైన వారిచే సర్వే శిక్షణను 50 రోజుల పాటుఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు, భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు హక్కులపై తదితర అంశాలపై ప్రత్యేకశిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మానవ జీవితంలో పుట్టినప్పటినుండి మొదలుకుని మనిషి చనిపోయేవరకు కూడా "భూమి" యొక్క అవసరము ఉంటుందని, ప్రతి ఒక్కరికి ఇది అవసరమని తెలిపారు. నిత్య జీవితంలో ఎన్ని మార్పులు, సాంకేతిక మార్పులు, కంప్యూటర్స్, ఇతర సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలు రోజు రోజుకు కొత్తగా వస్తున్నాయని, టెక్నాలజీ పెరుగుతున్నదని, ఎన్ని మార్పులు జరిగినా కూడా ఈ భూముల విషయంలో మాత్రం సహజంగానే అలాగే ఉన్నామని, రైతులు ఈ భూముల వ్యవసాయం చేస్తేనే మనమంతా సుఖసంతోషములతో బ్రతుకుచున్నామని, అందుకే ఈ భూములను ఎప్పటికప్పుడు పర్యవీక్షిస్తూ, ఎలాంటి గెట్టు తగాదాలు లేకుండా ఉడెందుకుగాను, హద్దులను కాపాడేందుకు గాను, సర్వేయర్ ల కొరత తీరెందుటకై రాష్ట్ర ప్రభుత్వము "భూ భారతి" స్కీం ప్రారంభించిందని తెలిపారు. ఈ స్కీం ద్వారా భూములు, లావాదేవిలు, జరిగినప్పుడు సర్వే చేసి హద్దులను నక్షాల్లో పొందుపరిచిన తర్వాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, దీనివల్ల తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగ యువకులు శ్రద్ధగా ఈ ట్రైనింగ్ పూర్తి చేసీ రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాకు 76 మందికి ట్రైనింగ్ ఇచ్చి, ఎగ్జామ్ పెట్టి పాస్ అయిన వారికి సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, జిల్లా సర్వే అధికారి వి. శ్రీరామ్,ఇన్స్పెక్టర్ అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వ్యాప్తంగా మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్

-నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి




**హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:** నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డివిజన్ ప్రజలను కోరారు. సోమవారం బంజారాహిల్స్ లోని ఎన్.బి.టి నగర్ లో ప్రీ మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ...ఇంట్లో ఉన్న చెత్తను తప్పని సరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, చెత్తను బయట వేయడం వలన దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. డివిజన్ ప్రజలు స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు నివాసితులు సహకరించాలన్నారు. వార్డు ప్రజలు తమ చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటో లకు ఇవ్వాలని కోరారు. కొన్ని ఏరియాలో బిన్స్ పెట్టిన వేయడం లేదని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో చేయవద్దని కోరారు. అదే విధంగా భవన నిర్మాణ వ్యర్థాలు కూడా రోడ్డుపై వేయవద్దని, సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వారికి ఫోన్ చేస్తే వారే తీసుకొని పోతారని, బయట వేయడం మూలంగా అనారోగ్య బారిన పడే అవకాశం ఉంటుందని మేయర్ తెలిపారు. గత పదేళ్ల నుండి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని ఎన్నికల సందర్భంలో మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు.అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ ప్రీ శానిటేషన్ డ్రైవ్‌లో బంజారాహిల్స్ మూడు నుండి 5 రోజుల్లో క్లీన్ చేయడం జరుగుతుందని, డివిజన్‌లోని పలు కాలనీలో పనిచేసే శానిటేషన్ కార్మికులు వారిని ఏమాత్రం ఇబ్బంది లేకుండా రెండో సారి అటెండెన్స్ తీసుకొనే సమయంలో కార్మికులు అందరూ ఒకే చోట పని చేసి మొత్తం శుభ్రం చేస్తారని అడిషనల్ కమీషనర్ తెలిపారు. ఇక్కడ మూడు రోజుల్లో పూర్తి చేసే మరొక డివిజన్‌లో క్లీన్‌వార్డు గా చేయడం జరుగుతుందన్నారు. ఆవిదంగా గ్రేటర్ లో ఉన్న150 వార్డులను క్లీన్ చేయడం జరుగుతుందని రఘు ప్రసాద్ పేర్కొన్నారు. జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈసారి వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్, లాంటి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరిస్తే క్లీన్ వార్డు గా చేస్తామన్నారు. స్వచ్ఛ ఆటో లోనే చెత్త వేయాలన్నారు. నీటినిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

-జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్




ఫిర్యాదులను స్వీకరిస్తున్న స్నేహశబరీష్, యాదగిరిరావు, అశోక్‌సామ్రాట్ తదితరులు

**హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పై విన్నపాలను అడిషనల్ కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగం అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా స్నేహశబరీష్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలు వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు.జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 33, ఇంజనీరింగ్ 4, ట్యాక్స్ సెక్షన్ 3, ల్యాండ్ అక్విజిషన్, హెల్త్, యు.సి.డి, యు.బి.డి విభాగాలకు రెండు చొప్పున, ఎలక్ట్రికల్, పి.ఓ.ఎల్.డబ్ల్యూఎస్, అడ్మిన్, కూకట్ పల్లి జోన్, శానిటేషన్, ఖైరతాబాద్ జోన్, ఎలక్షన్, ఎల్బీనగర్ జోన్, డి.సి 18, డి.సి 17 లకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 104 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 40, సికింద్రాబాద్ జోన్ లో 27, శేరిలింగంపల్లి జోన్ లో 18, ఎల్బీనగర్ జోన్ లో 12, చార్మినార్ జోన్ లో 7 ఆర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ అధికారులకు ఆదేశించారు.ఈసమావేశంలో అడిషనల్ కమిషనర్‌లు యాదగిరి రావు, అశోక్ సామ్రాట్, వేణు గోపాల్, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సిసిపిలు గంగాధర్, వెంకన్న, ఎల్.ఏ.ఓ రాము నాయక్, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, డిప్యూటీ సిఈలు పనస రెడ్డి, పివి రావు, హౌసింగ్ ఈఈ రాజేశ్వర రావు, జాయింట్ కమీషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, ఏఎంసి జీవన్ కుమార్ పాల్గొన్నారు.

## పాతలేఔట్‌లే లక్ష్యంగా పార్కులు,రహదారులు కబ్జా

-హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు
-క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తామని కమిషనర్ హామీ




ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న హయత్‌నగర్ టి.నగర్ వెల్ఫేర్‌అసోసియేషన్ ప్రతినిధులు

**హైదరాబాద్,మే 26,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ లే ఔట్లే లక్ష్యంగా కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఒకప్పుడు నగర శివార్లుగా ఉన్న భూముల్లో వేసిన పంచాయతీ లే ఔట్లకు రక్షణ లేకుండా పోయిందంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. రహదారులు, పార్కుల హద్దులను చెరిపేసి వ్యవసాయ భూములుగా మార్చేశారంటూ వాపోతున్నారు. ఇదేమని అడిగితే పాసు పుస్తకాలు చూపించి ఈ భూములు మావంటూ వెళ్లగొడుతున్నారని ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులు రాగా.. అందులో 60 శాతానికి పైగా పాత లే ఔట్లపైనే ఉన్నాయి. అలాగే పార్కులు, రహదారుల కబ్జాలపైనా ఫిర్యాదులందుతున్నాయి. వీటిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ గూగుల్ మ్యాప్స్ ద్వరా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు. అలాగే క్షేత్ర స్థాయిలో పరిశీలనకు సమయమిచ్చారు. అధికారికంగా రివైజ్ చేయని పక్షంలో పాత లే ఔట్ ప్రకారమే రహదారులు, పార్కులుంటాయని స్పష్టం చేశారు. ఫిర్యాదులను లోతుగా పరిశీలించి.. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఫిర్యాదులు ఇలా..**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని 93,94 సర్వే నంబర్లలో 3620 గజాల పార్కు స్థలాన్ని కాపాడాలంటూ టి. నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. 16 ఎకరాల పరిధిలో 148 ప్లాట్లతో 1966లో టీ నగర్ లేఔట్ వేయగా.. పార్కు స్థలం ఇదొక్కటే ఉండగా.. శ్రీనివాస చౌదరి కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలం, కొర్రెముల గ్రామం, 739 నుంచి 749 వరకూ ఉన్న సర్వే నంబర్లలో మొత్తం 149 ఎకరాల మేర ఉన్న ప్రొ. జయశంకర్ ఏకశిలా కాలనీ లే ఔట్ 1987లో మొత్తం 2080 ప్లాట్లతో వేశారు. ఇందులోని నాలుగు సర్వే నంబర్లలో 47 ఎకరాల భూమి మాదంటూ ఆలూరి వెంకటేష్ తో పాటు మరికొందరు పాసుపుస్తకాలు సంపాదించి కబ్జా చేశారని బాధితులు వాపోయారు. రిట్ పిటిషన్ 8859/2009 ద్వారా లే ఔట్‌ను బతికించుకున్నా.. మళ్లీ 7 ఎకరాలు ధరణి ద్వారా పాస్ పుస్తకం తెచ్చుకుని తమను అడ్డుకుంటున్నారని ప్రజావాణి ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్దంబర్‌పేట 264, 265, 266 సర్వే నంబర్లలో 500 ప్లాట్లతో శ్రీ బాలాజీ నగర్ కాలనీ పేరిట ఉన్న లే ఔట్ తర్వాత శ్రీ సాయినగర్ కాలనీ లే ఔట్‌గా మారిపోయిందని పాత లేఔట్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రిట్ పిటిషన్ 33331/2018 ద్వారా కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఇందులోని 40 అడుగుల ప్రధాన దారిని మూసేయడంతో ఔటర్ రింగురోడ్డును, విజయవాడ హైవేకు దారి లేకుండా అయ్యిందని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం రెడ్డి ఎన్‌క్లేవ్‌లో 2460 గజాల పార్కు స్థలం ఉంటే.. అందులో 667 గజాల స్థలాన్ని కబ్జా చేశారని ఆకాలనీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ఉన్నా కబ్జా జరిగిపోయిందని వాపోయారు. మొత్తం 10 ఎకరాల వరకూ ఉన్నలే ఔట్‌లో 200ల ప్లాట్లుండగా.. పార్కు లేకుండా అయ్యిందన్నారు. పార్కు స్థలంపై కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా.. కబ్జాదారుడిని ఖాళీ చేయించడం ఎవరి తరం కావడంలేదని పేర్కొన్నారు. జీహెచ్ ఎంసీ వాళ్లు పార్కుగా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. మెహిదీపట్నం మల్లేపల్లి మార్గంలోని ఆసిఫ్‌నగర్ లో దర్గా భూమిని కూడా కబ్జాదారులు వదలడం లేదని మొత్తం 3800 గజాల స్థలం తనదని.. అప్సర్ అహ్మద్ అనే వ్యక్తి కబ్జా చేశారంటూ దర్గా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. భవన అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిగిపోతున్నాయని వాపోయారు. ఆ భూమి నుంచి ఖాళీ చేయాలని జీహెచ్ ఎంసీ నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని.. ధర్గా భూమిని కాపాడాలంటూ ప్రతినిధులు హైడ్రాను ఆశ్రయించారు.

## మణికొండలో అనుమతి లేని భవనాలు కూల్చివేత

("వార్త ప్రభావం")

- బిల్డర్లు, ప్రజలందరూ నిబంధనలను పాటించాలి : కమిషనర్



మణికొండ పంచవటి కాలనీలో అనుమతి లేని భవనాల శ్లాబులను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారుల దృశ్యం

**నార్సింగి, మే 26 ప్రభాతవార్త :** ఈ నెల 23.వ,తేదీన వార్త దినపత్రిలో "మణికొండలో యధేచ్ఛగా అనుమతి లేని నిర్మాణాలు" అన్న శీర్షికపై వచ్చిన కథనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. సోమవారం మణికొండ మున్సిపల్ పరిధిలోని పంచవటి కాలనీ, అల్కాపూర్ గోగ్రీన్ కాలనీలలో అనుమతులను ఉల్లంఘించి నిర్మించిన అంతస్థుల శ్లాబులను తొలగించారు. జి+4 అనుమతి పొంది జి+5,6 అంతస్థులు నిర్మించిన భవనాలలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, బిల్డర్లు అందరూ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. అనుమతి ఒకటి తీసుకొని, నిర్మాణం మరోలా ఉంటే చట్ట పరిధిలో తప్పకుండా చర్యలు తీసుకుంటామని, కూల్చివేతలు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతటి వారైనా చట్టంను గౌరవించాలని, చట్టంను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఇక నుంచి మణికొండలో భవన నిర్మాణాల విషయంలో ప్రతీరోజు స్పెషల్ డ్రైవ్ చేపడుతామని, ఎక్కడ అనుమతిని ఉల్లంఘించి నిర్మాణం జరిగినా నా దృష్టికి వస్తే, అదే రోజు పనులు ఆపివేయిస్తానని వివరించారు. నిర్మాణం చేపట్టిన తరువాత కూల్చిడం వలన నిర్మాణం దారులు నష్టపో తారని, కడుతున్న సమయంలోనే ఆపివేస్తే ఆ నష్టం జరుగకుండా ఉంటుందని కమీషనర్ ప్రదీప్ కుమార్ తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



ప్రసంగిస్తున్న పివోడబ్ల్యు జాతీయ నాయకుడు సంధ్య తదితరులు

**చిక్కడపల్లి, మే 26 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం (టీఎస్ డిఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో టీఎస్‌డిఎఫ్ కన్వీనర్ ఏ వినాయక రెడ్డి, పి ఓ డబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ ను నిలిపివేయాలని, కాల్పులవిమరణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ 29న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు.సాయుధ పోరాటం చేస్తున్న మావోయిస్టు పార్టీ నాయకులు ప్రభుత్వంతో చర్చలకు మార్చి, ఏప్రిల్ ,మే నెలలో ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. దేశంలో వివిధ పార్టీలు ప్రజా సంఘాలు ప్రజాస్వామిక వాదులు మావోయిస్టుల పార్టీతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా,కేంద్ర ప్రభుత్వం, ఛత్తీజ్‌గడ్ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదని, . ఇది రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. మరోవైపు ప్రధానమంత్రి మోడీ, అమిత్ షా పదేపదే మార్చి 26 వరకు దేశాన్ని నక్సల్ రహిత దేశంగా ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అపవాస్యం చేయడమే అవుతుంది అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార ఆపరేషన్ నిలిపివేయాలని కోరారు. 29న జరిగే రాష్ట్ర సదస్సుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ నాయకుడు ఈటి నరసింహ, సిపిఐ ఎంఎల్ నాయకుడు చలపతిరావు, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.మీడియా ప్రతినిధఉల సమావేశంలో ఇండియన్ నేషనల్ లిస్టు మూమెంట్ పార్టీ నాయకుడు కృష్ణ ప్రసాద్, హనుమేష్,ఆర్ఎస్పీ నాయకుడు జానకి రాములు, గోవర్ధన్, ఆరేళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా 29న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయవలసిందిగా, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, ప్రజా సంఘాలకు, ఈ అంశంపై కలిసివచ్చే వివిధ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

## సైదాబాద్‌లో మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

**సైదాబాద్, మే 26 ప్రభాతవార్త:** పదవ తరగతిలో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురైన ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ..వినయ్‌నగర్ కాలనీలోని రాధే రెసిడెన్సీలో కంబాలపల్లి సుజాత, వెంకటయ్య దంపతులు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమారుడు రిషి(16) ఇటీవలే వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యాడు. దీంతో సప్లమెంటరీ పరీక్షలు వ్రాసుకోవచ్చని తల్లిదండ్రులు రిషికి ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. అయితే అతను డిప్రెషన్‌లోనే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం తన స్నేహితుడి ఫోన్‌లో రిషి గేమ్స్ ఆడుతుండడం గమనించిన తల్లి సప్లిమెంటరీ పరీక్షలు దగ్గర్లో ఉన్నాయని చెప్పి మందలించింది. ఆదివారం టివి చూస్తున్న రిషిని మరోసారి అతని తల్లి మందలిస్తూ చదువుకోవాలని సూచించింది. సోమవారం మధ్యాహ్నం సుజాత పని నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో ఆమె చిన్న కుమారుడు ఫోన్ చేసి రిషి బిల్డింగ్ మీద ఉన్న ఐరన్ స్టెప్స్‌కు ఉరివేసుకున్నాడని చెప్పడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుంది. ఓవైసీ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే రిషి చనిపోయినట్లుగా వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

-మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న షేక్ అక్బర్ తదితరులు

**మలక్ పేట ,మే 26, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్ పేర్కొన్నారు. అక్బర్ బాగ్ చెందిన పారపల్లి భారతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జారీ అయిన రూ. 2.25 లక్షల చెక్కు ను సోమవారం షేక్ అక్బర్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని తెలిపారు. మలక్ పేట నియోజకవర్గం ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని షేక్ అక్బర్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి సహాయనిది ని అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆయన ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, వివిధ కాలనీల ప్రతినిధులు.

**వనస్థలిపురం. మే.26.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి,వివిధ కాలనీల ప్రతినిధుల తో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వనస్థలిహిల్స్ కాలనీలో ఓపెన్ జిమ్,క్రాంతి హిల్స్ కాలనీలో పార్క్,ఓపెన్ జిమ్,సీనియర్ సిటిజన్ భవనం,అదేవిధంగా క్రిస్టియన్ కాలనీ,జహంగీర్ నగర్ కాలనీలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ కు వివరించారు. అందుకు స్పందించిన జోనల్ కమిషనర్ ప్రాధాన్యత ను బట్టి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాంతి హిల్స్ ,క్రిస్టియన్ కాలనీ, వనస్థలిహిల్స్ కాలనీల ప్రతినిధులు రాంరెడ్డి,హరినాథ్ రెడ్డి,కంచి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దివంగత మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ సేవలు ఎనలేనివని : వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



దివంగత మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట,మే 26, ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ చేసిన సేవలు ఎనలేనివని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. సుధీర్ కుమార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సుధీర్ కుమార్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో దిక్సూచి ఐఏసి



విద్యార్థులను సన్మానిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:** పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థులకు ఐఏసి దిక్సూచిగా నిలుస్తుందని ఆ సంస్థ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐఏసి సంస్థల విజయోత్సవ సభకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్, ఎస్‌ఎస్సి, ఆర్‌ఆర్‌బి, పోలీస్ డిపార్ట్మెంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారు సత్కరించి మొమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉద్యోగ సాధనలో విద్యార్థులు వేసే ప్రతి అడుగులో చివరి వరకు సంస్థ తోడుగా ఉంటుందన్నారు.ప్రతిభ కలిగిన విద్యార్థులకు సీనియర్ అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ, మార్క్ టెస్ట్‌లు వాటి ఎక్స్‌ప్లనేషన్లు ఇస్తూ ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నత ఉద్యోగాలు సాధించిన ఘనత క్యాంపస్‌కు ఉన్నదన్నారు. వేలాదిమంది విద్యార్థులు ప్రతి సంవత్సరము శిక్షణ పొందుతూ పలు ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు.

## టిఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:**
కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్‌వి ప్రెసిడెంట్ గుండుమల్ల పాండుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ జి.వి.సాగర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిఆర్‌ఎస్వి ఉద్యమ నాయకుడు ఎండి.జహీర్‌ఖాన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, పులికంటి వెంకట్, మల్లెపాక యాదగిరి, ఇటుకల యాదగిరి, విశ్వేశ్వర్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వేయని రోడ్డుకు బిల్లులు తీసుకున్న అక్రమార్కులపై చర్యలేవి?

## - ఫిర్యాదు చేసినా మీనామేషాలు లెక్కిస్తున్న అధికారులు -విజిలెన్స్ విచారణకు స్థానికుల డిమాండ్



రాత్రి వేళల్లో రోడ్డు వేసేందుకు జెసిబితో వచ్చిన అధికారులు



కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి(ఫైల్ ఫొటో)

**సైదాబాద్, మే 26 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో రోడ్డు వేయకుండానే రోడ్డు వేసినట్లుగా రికార్డుల్లో చూపి బిల్లులు కాజేసిన అధికారులు తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు తిప్పలు పడుతున్నారు. నిధుల స్వాహాపై స్థానిక కార్పొరేటర్ ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా మీనామేషాలు లెక్కిస్తూ అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలో వర్క్ ఐడి నెం. 24041451, టెండర్ ఐడి నెం.539228 దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు వేయకుండానే తప్పుడు బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేశారని, దీనిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి జిహెచ్‌ఎంసి కమీషనర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం రాత్రి జెసిబి, సిబ్బందితో వచ్చి రోడ్డు వేయడానికి ప్రయత్నించారు. రోడ్డు వేస్తున్న విషయంపై ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జిహెచ్‌ఎంసి ఎఇకి సమాచారం ఇవ్వకుండానే గతంలో ఇక్కడ పనిచేసిన ఎఇ వచ్చి రోడ్డు వేసే పనులు చేపట్టారు. రాత్రి వేళల్లో జెసిబితో వచ్చి రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న స్థానికులు, బిజెపి నాయకులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకుని రాత్రి వేళల్లో ఇంత హడావిడిగా రోడ్డును ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించడంతో సదరు ఎఇ పొంతనలేని సమాధానాలు చెబుతూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. గత వినాయక చవితి సందర్భంగా సింగరేణి కాలనీ వాంబే గృహ సముదాయాల వద్ద రూ.9.90 లక్షలతో మంజూరైన సిసి రోడ్డును వేయకుండానే బిల్లులు తీసుకున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని, సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వరకు వదిలేది లేదని కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

### విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి!

లక్ష్మీనగర్ కాలనీ పార్కులో మరమ్మత్తు పనులకు గత ఏడాది రూ.2లక్షలు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు పనులు జరుగలేదని, అయితే ఈ పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇప్పటికే సదరు కాంట్రాక్టర్ తీసుకున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని పనులు, బిల్లులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

# రామంతాపూర్ గుడ్ డే బార్‌లో స్నేహితుల మధ్య ఘర్షణ

### -బీర్ బాటిల్‌తో దాడి చేసి హత్య....బార్ యజమాన్యంపై కేసు



మృతుడు కె.పవన్‌కుమార్ ( ఫైల్‌ఫోటో)

**ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :**
బార్‌లో మద్యం సేవించేందుకు వేర్వే రుగా వచ్చిన స్నేహితుల మధ్య జరిగి న గొడవలో ఒక యువకుడు దారుణ హత్యకు గురైయ్యాడు. ఇతరులతో కలిసి మద్యం సేవించేందుకు వచ్చిన స్నేహితుడిని తనకు చెప్పకుండా ఎందుకు వచ్చావని ప్రశ్నించి బీర్ బాటిల్ లో దాడి చేయడంతో అతను అక్కడిక క్కడే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలం, చేగుంట గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కర్, శ్రీమాత బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అంబర్‌పేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ప్రవీణ్(26), పవన్ కుమార్ అలియాస్ కల్యాణ్ (24) ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం కొత్తపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లో ప్రవీణ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆదివారం రాత్రి ప్రవీణ్ సోదరుడు పవన్‌కుమార్, అతని స్నేహితుడు రిషికేస్ అలియాస్ నానితో కలిసి రామంతాపూర్‌లోని గుడ్ డే బార్‌లో మద్యం సేవించేందుకు వచ్చారు. అప్పటికే బార్‌లో ఉన్న పటేల్‌నగర్‌కు చెందిన లింగనోళ్ల శ్రవణ్ కుమార్‌గౌడ్ (26) అనే వ్యక్తి బార్‌లో పక్క టేబుల్‌పై ఉన్న హరికృష్ణ అనే వ్యక్తితో గొడవ పడి అతనిని బీర్ బాటిల్‌తో దాడి చేసినట్లు తెలిపారు.తనకు చెప్పకుండా బార్‌కు రావడంతో ఆగ్ర హించి అతని పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పక్కనే ఉన్న పవన్‌కుమార్ వీరి గొడవను ఆపేందుకు మధ్యలో వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇదే క్రమంలో శ్రవణ్‌కుమార్ గౌడ్ బీర్ బాటిల్‌తో పవన్‌కుమార్ కణ తపై దాడి చేయడంతో అతను అక్కడే కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ గొడవలో హరికృష్ణకు కూడా గాయాలు అయినట్లు పోలీ సులు తెలిపారు. రాత్రి 11 గంటల సమయంలో బార్‌లో గొడవ జరుగుతున్నా యజమాన్యం సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. బార్ యజమాన్యం నిర్లక్ష్యం కూడా ఉందని, దీంతో బార్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కుమ్మరి భాస్కర్ ఇచ్చిన పిర్యాదు మేరకు లింగనోళ్ల శ్రవణ్‌కుమార్‌గౌడ్‌తోపాటు, గుడ్ డే బార్ యజమాన్యంపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు. మృతుడు పవన్ కుమార్ అలియాస్ కళ్యాణ్ డిగ్రీ పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. తన ఇద్దరు కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరు అవుతున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మాజీ హోమ్ శాఖ మంత్రి మహమూద్ అలీని పరామర్శించిన కెటిఆర్



మహమూద్ అలీ ని పరామర్శిస్తున్న కేటీఆర్ తదితరులు

**మలక్ పేట ,మే 26, ప్రభాతవార్త:**
మాజీ హోమ్ శాఖ మంత్రి మహమూద్ అలీని బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. వైరల్ ఫీవర్‌తో బాధ పడుతూ అబిడ్స్ చాపల్ రోడ్ లోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమూద్ అలీని సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆసుపత్రి వైద్యులను కలిసి మహమూద్ అలీ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునే విధంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్య క్రమంలో అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బిఆర్ ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజాం ఆలీ,గోషామహల్ బిఆర్‌ఎస్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్,, మహిళా నాయ కురాలు ప్రియ గుప్తా, జాంబాగ్ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షులు అహ్మద్ భాయ్, ప్రదీప్,్నటపు, శైలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి పంచవటి కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

### -అధ్యక్షుడిగా మణిరాం నాయక్, కార్యదర్శిగా ఆంజనేయులు.



మేడిపల్లి పంచవటి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు

**మేడిపల్లి, మే 26 ప్రభాతవార్త :**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పంచవటికాలనీ నూతన కార్యవర్గం కాలనీ వాసులు ఎన్నుకోవడం జరిగింది. ఓటింగ్ పద్దతిలో జరిగిన ఈ ఎన్నికలలో కాలనీ అధ్యక్షుడిగా భుక్య మణిరాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా దొండపాటి ఆంజనేయులు విజయం సాధించారు. కోశాధికారిగా రేవనూరి నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా శ్రీశ్రీశ్రీ పంచవటి వి ఘ్నేశ్వర ఆలయ కమిటీ అధ్యక్ష పదవి ఎన్నికలో వంగ శ్రీనివాస్ రెడ్డి, ముక్తేశ్వర్రెడ్డిలకు సమానంగా ఓట్లు రావడంతో ఇద్దరికి చేరో ఏడాదిగా నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శిగా ఏటూరి విద్యాధర్ శర్మ, కోశాధికారిగా వాసుదేవ మూర్తిలు గెలుపొందారు. ఈ ఎన్నికల ప్రక్రియను కమిటీ సభ్యులు కె. శంకరచారి, వరకల శ్రీనివాస్, బోటిక శ్రీనివాస్, వేముల సుమేష్ గౌడ్. సేవకుల గీతా, బచ్చు సాగర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... కాలనీ ఆలయ ప్రారంగణంలో జరిగిన ఎన్నికలలో తమ పై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించినందుకు కాలనీవాసులకు కృజ్ఞతలు తెలిపారు. కాలనీ, ఆలయ అభివృద్ధికి తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి అభివృద్ధికి తోడ్పడతమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తమన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి కార్యవర్గాన్ని నియమించుకోని సాధరణ సర్వసభ సమావేశం నిర్వహిస్తామన్నారు.

## 35 సంవత్సరాలుగా కాలనీ అధ్యక్షునిగా చంద్రశేఖర్ గుప్తా ఏకగ్రీవం



చంద్రశేఖర్‌గుప్తను సన్మానిస్తున్న అంజయ్యగుప్తా

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీ సంక్షేమ సంఘం చైర్మన్‌గా గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 35 సంవత్సరాలుగా చంద్రశేఖర్‌గుప్తా కాలనీ చైర్మన్గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. సందర్భంగా వాసవికాలనీ నివాసుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో 2025-2028గాను వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, లక్ష్మయ్య, మనోహర్‌రావు, ప్రధానకార్యదర్శిగా అయితే అంజయ్యగుప్తా, జాయింట్‌సెక్రెటరీలుగా గౌరీశంకర్, రామకృష్ణ, సిద్ధార్థ, కోశాధికారిగా కృష్ణయ్య, జాయింట్ ట్రెజరీగా దండు రాజు, ఈసీ మెంబర్స్‌గా చిలుక ఉపేందర్‌రెడ్డి, బాలరాజు, జయరాం, కళ్యాణ్, లచ్చన్న, మల్లారెడ్డి, మల్లికార్జునరావు, ప్రకాష్‌రావు, ప్రసాద్, రామయ్యతో పాటు పదిమంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి.సుభాకర్ రావు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశామన్నారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేశామన్నారు. అందరి సహకారంతో భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి సాయి శక్తుల కృషి చేస్తామన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



ఇందిరమ్మ ఇళ్ళ పనులు ప్రారంభిస్తున్న చల్లా నర్సింహారెడ్డి: చిత్రంలో సిద్దాల దశరథ, బైగళ్ళ బాలమణి తదితరులు

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక 19వ డివిజన్ పరిధి కిందకు వచ్చే అంబేద్కర్‌నగర్‌లో 26 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బైగళ్ళ బాలమణి, అంబేద్కర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు బైగళ్ళ ఓం ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టియుఎఫ్‌ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, పార్టీ నాయకులు ఏదుదొడ్ల సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సిద్దేశ్వరచారి, మాదరి శ్రీనివాస్, దండు యాదయ్య, బిక్షపతి, భాస్కర్, వెంకటేశ్, కుమార్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## నేడు చంపాపేటలో ఉచిత వైద్య బిరం..అన్నదానం



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ దండేటి కార్ భగవత్ జి

**సైదాబాద్, మే 26 ప్రభాతవార్త:**
చంపాపేటలోని నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయం సమీపంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం, అన్నదానం నిర్వహిస్తు న్నట్లు శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్టు ఫౌండర్ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్రి రాజశేఖర్‌రెడ్డి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. దుండిగల్ అరుంధతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ బిఆర్‌ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, టింగ్లికార్ రాజేష్, తిలక్‌రాజ్, రాజా, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ వర్ధంతి



సుధీర్ కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**సైదాబాద్, మే 26 ప్రభాతవార్త:**
మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ వర్ధంతి సందర్భంగా కర్మన్ ఘాట్‌లోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోయిలకొండ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఈపూరి బద్రినాథ్, ఆల వెంక టర్రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీ కాంత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కోయిల కొండ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణనగర్‌లో డ్రైనేజీ పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే



బాలకృష్ణనగర్‌లో డ్రైనేజీ పనులు చేపట్టాలని జలమండలి జీఎంను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :**
రామంతాపూర్ బాల కృష్ణనగర్ కాలనీలో డ్రైనేజీ పనులు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రామంతాపూర్ బాలకృష్ణ నగర్ కాలనీ సమస్యలపై పలువురు బిఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవిం చారు. దీంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జలమండలి జిఎం సంతోష్ కుమార్‌ను పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. బాల కృష్ణనగర్ కాలనీలో అభివృద్ధి పనులు అడ్డుకోవద్దని, నిధులు మంజూరైన ప్రాంతంలోనే పనులు చేపట్టాలని సూచించారు. అభివృద్ధిని అడ్డుకునే హక్కు ఎవరికి లేదన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నేతలు గంధం నాగేశ్వర్ రావు, ఎం.డి.జహంగీర్, ఇలిటం నరసింహారెడ్డి, మహే శ్వర్‌రెడ్డి, కాలేరు నవీన్, మాస శేఖర్ పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు రక్షణ కవచాలు:ఎమ్మెల్సీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ దయానందగుప్తా

**ఎల్‌బినగర్, మే 26 ప్రభాతవార్త:**
ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీసీ కెమెరాలు రక్షణ కవచాలుగా ఉంటాయని ఎమ్మెల్సీ బొగారం దయానంద్ గుప్తా పేర్కొన్నారు. కొత్తపేట చైతన్యపురి డివిజన్ల కార్పొరేటర్లు పవన్ కుమార్ నరసింహ గుప్తాలతో కలిసి ఎమ్మెల్సీ మారుతి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిరంకి రవి, సెక్రటరీ ప్రభాకర్, చైతన్యపూరీ సబ్ ఇన్స్పెక్టర్ భద్రయ్య, ఉపాధ్యక్షులు రవి కేశవ్, మహేష్ దాయమా, మురళి కృష్ణ, ట్రెజరర్ శ్రీనివాస్ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీస్: అంజనేలు, శంకర్, అరుణ్ కుమార్, సంతోష్, సలహాదారులు శంకర్ రెడ్డి, సత్తయ్య, రాంచందర్, ఉపేందర్, ఎగ్జిక్యూటివ్స్ మెంబర్స్ ఆశీష్ రావు, సదానంద్, శ్రీనివాస్, అంజి, వాసు.రవి, హరి ప్రసాద్, నాగభూషణం, తాళ్లపల్ల పాల్గొన్నారు.

## నాచారం డివిజన్లో జరుగుతున్న ఫాగింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కార్పొరేటర్



ఫాగింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, మే 26 ప్రభాతవార్త :**
నాచారం డివిజన్లో ప్రతిరోజు దోమల నివారణ కోసం ఫాకింగ్ చేయిస్తున్నామని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. డివిజన్‌లో దోమల నివారణ కోసం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాగింగ్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువులో ఉన్న గుర్రపు డెక్క పూర్తిగా తొలగించడంతో హెచ్‌ఎంటి చుట్టుపక్కల ప్రాంతాలలో దోమల సమస్య తీరిందన్నారు. పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరగడంతో బాబానగర్, ఎర్రగుంట, రామ్ రెడ్డి నగర్, నాచారం విలేజ్ అంబేద్కర్ నగర్ చుట్టుపక్కల ప్రాంతాల వారు విపరీతమైన దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్నారని చెరువు చుట్టూ విధిగా ఫాగింగ్ చేయాలని ఎంతమాలజీ సూపర్వైజర్ పరమేష్ కు సూచించడమైందన్నారు.

## రైతుల సంక్షేమానికి భాగ్యనగర్ సొసైటీ కృషి : ఛైర్మన్ మల్రి నర్సింహారెడ్డి



రైతులకు విత్తనపు వడ్లను పంపిణీ చేస్తున్న ఛైర్మన్ మల్రి నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమానికి భాగ్యనగర్ రైతు సేవా సహకార సం ఘం కృషి చేస్తున్నదని సొసైటీ ఛైర్మన్ మల్రి నర్సిం హారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నాదర్‌గుల్‌లోని సొసైటీ కార్యాలయంలో రైతులకు బిపిటి విత్తనపు వడ్ల ఛైర్మన్ నర్సింహారెడ్డి మాజీ వైస్ ఛైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, సంఘం సెక్రటరీ పిండి నారాయణరెడ్డితో కలిసి రైతులు విత్తనపు వడ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ తరపున అందిస్తున్న విత్తనపు వడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు మల్రి లింగారెడ్డి, సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.